సాక్షి
పార్వతీపురం మన్యం

శుక్రవారం । 6 । జనవరి । 2023



అందాల బడి పిలుస్తోంది..రా..!

మూడేళ్ల క్రితం ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల భవనాలు దారుణంగా ఉండేవి. ఇక వసతుల సంగతి సరేసరి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు.

- 8లో



ఉత్సాహంగా పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ మీట్

విజయనగరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో గురువారం అంతర్ జిల్లాల రీజనల్ పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ మీట్ ఉత్సాహభరితంగా జరిగింది.

- 8లో

7వ తేదీ వరకు గడువు పెంపు

విజయనగరం పూల్‌బాగ్: సార్వత్రిక విద్యాపీఠంలో 2022-23 విద్యా సంవత్సరానికి ఎస్‌ఎస్‌సీ/ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి ఈనెల 5 నుంచి 7వతేదీ వరకు అవకాశం కల్పించినట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఎస్‌సీలో ప్రవేశానికి అడ్మిషన్ ఫీజుతో పాటు అదనంగా రూ.400, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి అడ్మిషన్ ఫీజుతో పాటు అదనంగా రూ.500 చెల్లించి ప్రవేశం పొందవచ్చన్నారు.

న్యూస్‌రీల్

జాతీయ స్థాయి వర్క్‌షాప్‌లో జెడ్పీ చైర్మన్

- పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహణ
- కేంద్ర మంత్రిని కలిసిన జెడ్పీ చైర్మన్



న్యూఢిల్లీలో జరుగుతున్న వర్క్‌షాప్‌లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం గంటస్తంభం: మండల, జిల్లా స్థాయి అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అంతర్జాతీయ కేంద్రంలో గురు, శుక్రవారాల్లో నిర్వహించే జాతీయస్థాయి వర్క్‌షాప్‌కు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరయ్యారు. మండలాలు, జిల్లాల అభివృద్ధికి 'ప్రాజెక్టు ఆధారిత అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన' అనే అంశంపై రెండు రోజుల పాటు వివిధ రంగాల నిపుణులు సూచనలిస్తారు. మన రాష్ట్రం తరపున జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సహా పలువురు జిల్లా పరిషత్ చైర్మన్లు హాజరయ్యారు. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ, సహాయ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్, కార్యదర్శి సునీల్‌కుమార్, సంయుక్త కార్యదర్శి అలోక్‌ప్రేమ్‌నాగర్ తదితరులు ప్రారంభోపన్యాసం చేశారు. పంచాయతీరాజ్ రంగంలోని పలువురు నిపుణులు, పలువురు కేంద్ర ప్రభుత్వ శాఖల అధికారులు కార్యక్రమంలో ప్రసంగించారు. మండల, జిల్లాపరిషత్‌ల అభివృద్ధికి నిధుల విడుదలపై కేంద్ర పంచాయతీరాజ్ మంత్రి కపిల్‌మోరేశ్వర్ పాటిల్‌ను కలిసి చర్చించినట్టు జెడ్పీచైర్మన్ స్థానిక విలేకరులకు ఫోన్‌లో తెలిపారు. వర్క్‌షాప్‌లో జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర జిల్లాల జేసీఎస్ కోఆర్డినేటర్‌గా హర్షవర్ధన్‌రెడ్డి



హర్షవర్ధన్‌రెడ్డి

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉత్తరాంధ్ర జిల్లాల 'జగనన్న సచివాలయం కన్వీనర్స్, గృహసారథి' (జేసీఎస్) కోఆర్డినేటర్‌గా హర్షవర్ధన్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉత్తరాంధ్ర జిల్లాల జేసీఎస్ పరిధిలోని విశాఖపట్నం, అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 35 అసెంబ్లీ కోఆర్డినేటర్లు, 9,567 సచివాలయ కన్వీనర్లు, 1,07,916 గృహ సారథులు ఉంటారు.

ఆ బిడ్డను ఎవరు విడిచిపెట్టారో?

- దర్యాప్తు చేస్తున్న పోలీసులు



ఎస్.కోటలో శిశువు మృతదేహాన్ని ఖననం చేస్తున్న పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది

వేపాడ: మండలంలోని కొత్తబొద్దాం వద్ద రోడ్డుపై బుధవారం రాత్రి ఓ మృత శిశువు దర్శనమిచ్చిన విషయం తెలిసిందే. గ్రామానికి చెందిన బి.మంగమ్మ ఇచ్చిన సమాచారం మేరకు వీఆర్‌ఓ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వల్లంపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రాజేష్ కేసు నమోదు చేసి ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి శిశువు మృతదేహాన్ని తరలించారు. అనంతరం ఎస్‌ఐ రాజేష్, సిబ్బంది రమేష్, నాయుడు, ఐసీడీఎస్ సిబ్బంది సమక్షంలో ఎస్.కోటలో మృతశిశువును గురువారం ఖననం చేశారు. ఆ బిడ్డను ఎవరు విడిచిపెట్టారన్న దానిపై లోతుగా విచారణ జరుపుతున్నారు.

ఆర్టీసీలో సంక్రాంతి సందడి



డిపోలో ఆర్టీసీ బస్సులు

- జిల్లా నుంచి సంక్రాంతికి 50 ప్రత్యేక బస్సులు
- ఈ నెల 10 నుంచి 13 వరకూ సర్వీసులు
- తిరుగు ప్రయాణానికి వీలుగా ఈ నెల 16 నుంచి 22 వరకు ప్రత్యేక సర్వీసులు
- హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణానికి రాకపోకలు
- ఇరువైపులా టిక్కెట్ తీసుకుంటే పది శాతం రాయితీ
- ఏర్పాట్లపై జిల్లా ప్రజారవాణా అధికారి సమీక్ష

పార్వతీపురం టౌన్:

ఆర్టీసీలో సంక్రాంతి సందడి ఆరంభమైంది. తెలుగువారి పెద్ద పండగకు సొంతూరు వచ్చి వేళ్లే ప్రయాణికులకు వీలుగా బస్సు సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. సాధారణంగా పండగల వేళ ప్రైవేటు బస్సు ఆపరేటర్లు ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రయాణికులందరూ ఆర్టీసీ సర్వీసుల్లో సుఖవంతమైన ప్రయాణం సాగించేందుకు, సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సులు నడపాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు ఇచ్చింది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం తదితర దూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చే వారి కోసం, తిరుగు ప్రయాణాలకు జిల్లాలోని పార్వతీపురం, పాలకొండ, సాలూరు డిపోల నుంచి 50 ప్రత్యేక బస్సులు నడపాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ప్రత్యేక బస్సులు నడిపే అంశంపై జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ మూడు డిపోల మేనేజర్‌లు, అధికారులతో సమీక్ష నిర్వహించి పూర్తి స్థాయి ఆదేశాలు జారీచేశారు. ప్రయాణికులకు ఏటువంటి అసౌకర్యం కులగకుండా సమయానికి బస్సు సర్వీసులు ఉండేలా సన్నాహాలు చేస్తున్నారు.

చార్జీలో 10 శాతం రాయితీ..

గతంలో ఏసీ బస్సులకు మాత్రమే రాయితీ సౌకర్యం ఉండేది. ప్రభుత్వాదేశాల మేరకు ఏసీ, అల్ట్రాడీలక్స్, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ వంటి అన్ని సర్వీసులకు రానుపోను ఒకేసారి టికెట్ తీసుకున్న సంక్రాంతి ప్రయాణికులకు చార్జీలో 10శాతం రాయితీ కల్పించారు. ప్రత్యేక సర్వీసులకు అదనపు చార్జీలు లేకుండా పేద, మధ్య తరగతి వారిని దృష్టిలో ఉంచుకొని 10శాతం రాయితీ కల్పించడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ముందుగానే రిజర్వేషన్లు చేసుకుంటున్నారు.



పార్వతీపురం ఆర్టీసీ డిపో

హైదరాబాద్ నుంచి జిల్లాకు బస్సులు ఇలా..		
తేదీ	డిపో	బస్సుల సంఖ్య
10	పార్వతీపురం	01
11	పార్వతీపురం	01
11	సాలూరు	01
11	పాలకొండ	01
12	పార్వతీపురం	02
12	సాలూరు	01
12	పాలకొండ	02
13	పార్వతీపురం	02
13	సాలూరు	01
13	పాలకొండ	01

హైదరాబాద్‌కు సర్వీసులు ఇలా..

ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా నుంచి హైదరాబాద్‌కు బస్సులు నడువకపోవడం, 5 ప్రైవేటు బస్సులు ఆపరేటర్లు నడుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. వాటిని చెక్ పెట్టేందుకు సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. ఇప్పటికే ప్రైవేటు ఆపరేటర్లు హైదరాబాద్‌కు రూ.1700 నుంచి రూ. 2200 వసూలు చేస్తున్నారు. అదే ఆర్టీసీలో మాత్రం రూ.1360 టిక్కెట్‌తో సూపర్ లగ్జరీ, రూ.1290తో అల్ట్రా డీలక్స్ బస్సులలో ప్రయాణించవచ్చు.

అసౌకర్యం కలగకుండా...



సంక్రాంతి పండగ సందర్భంగా ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు రానుపోను ఒకేసారి టిక్కెట్ తీసుకున్న సంక్రాంతి ప్రయాణికులకు చార్జీలో 10 శాతం రాయితీ కల్పించాం. జిల్లా నుంచి హైదరాబాద్‌కు 13 బస్సులు, ప్రతిరోజూ విజయవాడకు 6 అదనపు సర్వీసులు, విశాఖపట్టణానికి 30 బస్సులను ఏర్పాటు చేశాం. ప్రయాణికులందరూ ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలి.

– టీవీఎస్ సుధాకర్, జిల్లా ప్రజారవాణా అధికారి, పార్వతీపురం మన్యం

విజయవాడ, విశాఖపట్నానికి ఇలా..

జిల్లా నుంచి విజయవాడకు ప్రస్తుతం రోజుకు 7 బస్సులు నడుస్తుండగా పండగ సందర్భంగా ప్రతి రోజూ మూడు డిపోల నుంచి 2 చొప్పున 6 అదనపు సర్వీసులు నడపనున్నారు. జిల్లా నుంచి విశాఖపట్నానికి ప్రతిరోజూ 85 బస్సు సర్వీసులు ఉండగా ప్రతి రోజూ డిపోకు 10 చొప్పున మూడు డిపోల నుంచి 30 అదనపు బస్సులను నడపనున్నారు. సంక్రాంతి సెలవులు, తిరుగు ప్రయాణాల సందర్భంగా ఎవరు, ఎక్కడికి, ఎన్ని టిక్కెట్లు అడిగినా ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రయాణికులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా టిక్కెట్లు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ఉద్యోగులకు సెలవులు తగ్గించి మరీ బస్సు సర్వీసులు నడిపేందుకు చర్యలు చేపట్టారు. అందుకు ఉద్యోగులు సైతం సహకరిస్తున్నారు.

చంద్రబాబే రాష్ట్రానికి పట్టిన పెద్దఖర్మ

- కుప్పంలో చంద్రబాబు వ్యవహారశైలి జుగుప్సాకరం
- ఎన్టీఆర్‌తో పాటు ఆయన పథకాలకు వెన్నుపోటు పొడిచిన ఘనాపాటి చంద్రబాబు
- డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు:

చంద్రబాబే రాష్ట్రానికి పట్టిన పెద్దఖర్మగా ప్రజలు భావిస్తున్నారని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు తన ప్రచార ఆర్భాటానికి 40 మంది అమాయక ప్రజలను పొట్టన పెట్టుకున్నారని విమర్శించారు. ఇరుకు రోడ్లలో నిర్వహించిన బహిరంగ సభలు, రోడ్‌షోలతో ప్రాణనష్టం జరుగుతోందని, మైదానాలు, బహిరంగ ప్రదేశాల్లో సమావేశాలు పెట్టుకోవాలని ప్రభుత్వం జారీ చేసిన జీఓపై చంద్రబాబు రాద్ధాంతం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కుప్పంలో చంద్రబాబు వ్యవహార శైలి అత్యంత జుగుప్సాకరంగా ఉందన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన రెండు రూపాయల కిలో బియ్యం పథకాన్ని అధికారంలోకి రాగానే రద్దుచేసిన ఘనత ఎవరితో ప్రజలకు తెలుసన్నారు. 2014 ఎన్నికల్లో 600 హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చాక మోసం చేసిన విషయాన్ని ఎవరూ మరచిపోలేదన్నారు. చంద్రబాబును, టీటీపీను నమ్మే పరిస్థితిలో ఎవరూ లేరన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, రాష్ట్రాభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్‌కు బంగారులు బాటలు వేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిను రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు.

ఫేషియల్ యాప్ హాజరు తప్పనిసరి

- ఈనెల 16 వరకు ట్రయల్ రన్
- జెడ్పీ సీఈఓ రామన్న



సీతంపేట మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రామన్న

సీతంపేట:

ప్రభుత్వ ఉద్యోగులు ఈ నెల 16 నుంచి ఫేషియల్ యాప్ హాజరు తప్పనిసరిగా వేయాలని జెడ్పీ సీఈఓ ఆర్.రామన్న అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఫేషియల్ యాప్ ట్రయల్ రన్ ప్రస్తుతం కొనసాగుతోందన్నారు. అందరూ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఇన్‌స్టాల్ ప్రక్రియ పూర్తయిందని, కొన్ని మోడిఫికేషన్ జరుగుతున్నాయన్నారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లకు మల్టీపుల్ లొకేషన్ ఎనేబుల్ చేస్తారన్నారు. ఆఫీస్ స్టాఫ్‌కు సింగిల్ లొకేషన్ వంద అడుగుల దూరంలో ఉంటుందన్నారు. 14, 15 ఆర్థిక సంఘం నిధుల వినియోగం పత్రాలను సమర్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రాబోయే వేసవికాలం నీటి ఎద్దడి నివారణకు బోరు మెటీరియల్స్ ఎంత అవసరమో ముందస్తుగా ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. 42 గ్రామ సచివాలయాల భవనాల పనుల్లో ఒక్కటి మాత్రమే ప్రారంభించాల్సి ఉందన్నారు. డీఎల్‌డీఓ వి.గోపాలకృష్ణ మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో సిగ్నల్ లేని దగ్గర ఫైబర్ వైర్డ్ నెట్ 36 చోట్ల ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పింఛన్ల వెరిఫికేషన్, పంపిణీ వందశాతం పూర్తయినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.గీతాంజలి, ఈఓపీఆర్‌డీ కొండపల్లి సత్యం, పీఆర్ జేఈ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల కదలికపై నిఘా



సీఆర్‌పీఎఫ్, పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ సుభాష్

- పార్వతీపురం మన్యం జిల్లాను మావోయిస్టు ప్రభావిత జిల్లాగా గుర్తించిన కేంద్రహోమ్ శాఖ
- పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు అప్రమత్తంగా ఉండాలి
- పార్వతీపురం డీఎస్పీ సుభాష్

మక్కువ: పార్వతీపురం మన్యం జిల్లాను మావోయిస్టు ప్రభావిత జిల్లాగా కేంద్ర హోమ్‌శాఖ గుర్తించినందున, పోలీస్, సీఆర్‌పీఎఫ్ బలగాలు అప్రమత్తంగా ఉండాలని, మావోయిస్టుల ప్రతీ కదలికపై నిఘాపెట్టాలని పార్వతీపురం డీఎస్పీ ఎ.సుభాష్ సూచించారు. మక్కువ పోలీస్‌స్టేషన్‌ను ఆయన గురువారం సందర్శించారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అనంతరం సీఆర్‌పీఎఫ్ బ్యారెక్‌లో సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో మాట్లాడారు. పార్వతీపురం మన్యం జిల్లా సమీపంలో ఒడిశా రాష్ట్రం ఉన్నందున మావోయిస్టుల కదలికలు ఉంటాయన్నారు. మూడు నెలలుగా మావోయిస్టులు రిక్రూట్‌మెంట్ చేస్తున్నారని, యువతను ఆకర్షించే ప్రణాళికలు రచిస్తున్నారన్నారు. యూనిఫాంతో బయటకు వెళ్లేటపుడు సీఆర్‌పీఎఫ్ బలగాలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆర్‌ఓపీ, కూంబింగ్ నిర్వహించే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సెంట్రీ విధులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మావోయిస్టుల కదలికలు తెలిస్తే వెంటనే సీఐ ధనుంజయరావు, ఎస్‌ఐ పైడిరాజుకు సమాచారం ఇవ్వాలని సూచించారు. స్థానిక పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు సమన్వయంతో ముందుకు సాగాలన్నా రు. అనంతరం సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ ఆకుకు మారితో మావోలు కదలికలపై డీఎస్పీ సుభాష్ చర్చించారు.

జాతర ఏర్పాట్లపై ఆరా..

ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి జాతర ఈ నెల 23, 24, 25 తేదీల్లో జరగనున్నందున పోలీస్‌బందోబస్తు, జాతర ఏర్పాట్లపై డీఎస్పీ సుభాష్ ఆరా తీశారు. శంబర గ్రామంలోని చదురుగుడి వెనుకన క్యూలైన్ల స్థలాన్ని, సిరిమాను తిరిగే ప్రదేశాన్ని, వనంగుడి ఆవరణను పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండగా, ముందుస్తుగా అనుమానిత వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదుచేయాలన్నారు. జాతరలో పోలీస్ బందోబస్తు పక్కాగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సీఐ, ఎస్‌ఐలకు సూచించారు.

ఓటర్ల సంఖ్య 22,94,305

- 2023 ఓటర్ల తుది జాబితా విడుదల
- విజయనగరం జిల్లాలో 15,17,589 మంది
- పార్వతీపురం మన్యం జిల్లాలో 7,76,716 మంది ఓటర్లు
- పురుషులు కంటే మహిళా ఓటర్లే అధికం



విజయనగరం అర్బన్: ఉమ్మడి విజయనగరం జిల్లాకు సంబంధించి ఫొటో ఎలక్టోరల్ రోల్స్-2023 ఓటర్ల తుది జాబితా (స్పెషల్ సమ్మరీ రివిజన్)ను విడుదల చేసినట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ.సూర్యకుమారి గురువారం తెలిపారు. గణాంకాలు పరిశీలిస్తే పురుషుల కన్నా మహిళా ఓటర్లు 25,606 మంది ఎక్కువగా ఉన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన 11 శాసన సభ నియోజకవర్గాల పరిధిలో 22,94,305 మంది ఓటర్లు నమోదయ్యారు. వీరిలో విజయనగరం జిల్లాలో 15,17,589 మంది, పార్వతీపురం మన్యం జిల్లాలో 7,76,716 మంది ఓటర్లు ఉన్నారు.

జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితా

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
రాజాం	2,21,386	1,12,010	1,09,351	25
బొబ్బిలి	2,25,874	1,12,215	1,13,647	12
చీపురుపల్లి	2,01,130	1,00,768	1,00,354	8
గజపతినగరం	2,01,860	99,508	1,02,345	7
నెల్లిమర్ల	2,07,353	1,03,250	1,04,100	3
విజయనగరం	2,40,649	1,17,644	1,22,966	39
ఎస్.కోట	2,19,337	1,07,546	1,11,783	8
పాలకొండ (ఎస్టీ)	1,98,601	97,668	1,00,925	8
కురుపాం (ఎస్టీ)	1,91,594	93,599	97,956	39
పార్వతీపురం (ఎస్సీ)	1,88,773	93,310	95,451	12
సాలూరు (ఎస్టీ)	1,97,748	96,599	1,01,145	4
మొత్తం	22,94,305	11,34,117	11,60,023	165

పింఛన్ల పంపిణీలో మనమే నంబర్ 1

- రాష్ట్రంలో 64.06 లక్షల మందికి వైఎస్సార్ పింఛన్ కానుకలు
- వీటిలో కొత్తగా మంజూరు చేసిన పింఛన్లు: 2,31,989
- అర్హతే కొలమానంగా లబ్ధిదారుల ఎంపిక
- వీరఘట్టంలో కొత్త పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



వీరఘట్టం మండలంలో లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం:

దేశ చరిత్రలోనే అత్యధిక పింఛన్ల పంపిణీ చేస్తున్న రాష్ట్రంగా ఏపీ చరిత్రకెక్కిందని, 64.06 లక్షల మందికి వైఎస్సార్ ఫించన్ కానుకలు అందజేస్తూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి సరికొత్త రికార్డు సృష్టించారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పేర్కొన్నారు. వీరఘట్టం మండలంలో కొత్తగా 393 మంది లబ్ధిదారులకు మంజూరైన పింఛన్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పింఛన్ల మొత్తాన్ని ఏడాదికి రూ.250 పెంచుతూ ప్రస్తుతం నెలకు రూ.2,750లు చొప్పున ప్రభుత్వం అందజేస్తోందన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పింఛన్లు మంజూరు చేస్తున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలో కొత్తగా 2,31,989 మంది లబ్ధిదారులకు పింఛన్లు మంజూరైనట్టు వెల్లడించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రికి వచ్చే ఎన్నికల్లో గెలిపించి మరలా మన రాష్ట్ర ముఖ్యమంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీలు పత్రి విజయకుమారి, విశ్వాసరాయి భార్గవ్, ఎంపీడీఓ ఎ.ప్రభాకరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి లీలాప్రసాదరావు, కర్రి గోవిందరావు, బూరాడ చిన్న, భోగి మణి, దమలపాటి ఉమా, వావిలపల్లి ఉషారాణి, శిష్టు మధుసూదనరావు, వావిలపల్లి పురుషోత్తమరావునాయుడు, మొట్ట వెంకటరమణ, పింఛన్ లబ్ధిదారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పల్లెల ఆర్థిక ప్రగతికి కృషి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో పల్లెలు ఆర్థిక ప్రగతి సాధించేలా అధికారులు కృషిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. భూముల రీ-సర్వే, భూసేకరణ, మ్యుటేషన్లు, ఈ-క్రాప్ నమోదు, పీఎం కిసాన్, ఈకేవైసీ నమోదు, బిందుసేద్యం, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, పట్టుపరిశ్రమ, వైఎస్సార్ చేయూత, గృహ నిర్మాణం తదితర అంశాలపై జిల్లాల వారీగా సమీక్షించారు. భూ రికార్డులలో తప్పుగా నమోదైన వివరాలు వెంటనే సరిదిద్దాలని, భూ సేకరణ, జాతీయ రహదారుల పనులపై రోజువారీగా అధికారులు సమీక్షించాలన్నారు. గడువులోగా రబీ పంట ఈ క్రాప్ నమోదు పూర్తిచేయాలన్నారు. ఆయిల్‌పామ్ సాగు ప్రోత్సాహకాలు రైతులకు అందేలా చూడాలన్నారు. కలెక్టర్ నిషాంత్ కుమార్ జిల్లా నివేదికలను వివరించారు. రెవెన్యూ రికార్డుల పరిశీలనను వారం రోజుల్లో పూర్తిచేస్తామని చెప్పారు. 82 శాతం మేర ఈ క్రాప్ నమోదు పూర్తయిందన్నారు. కార్యక్రమంలో జేసీ ఒ.ఆనంద్, జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్‌పాల్, జిల్లా మత్స్యశాఖ అధికారి వి.తిరుపతయ్య, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎ.ఈశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకరరావు, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పి.రఘురాం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె.రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

108లో గిరిజన మహిళ ప్రసవం



108లో ప్రసవించిన గిరిజన మహిళ

సీతంపేట: ఎత్తైన కొండల మీద ఉన్న పూతికవలస పంచాయతీ పరిధి ఈతమానుగూడ గ్రామానికి చెందిన గిరిజన మహిళ ఆరిక పద్మావతి 108లో బుధవారం అర్ధరాత్రి ప్రసవించింది. పురిటినొప్పులతో ఆమె బాధపడుతుండగా కుటుంబసభ్యులు 108కు ఫోన్ చేశారు. ఈఎంటీ రాములు, పైలెట్ సింహాచలం గ్రామానికి వెళ్లి గర్భిణిని సీతంపేట ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో నొప్పులు తీవ్రం కావడంతో అంబులెన్స్‌ను పక్కన ఆపిన అంబులెన్స్ సిబ్బంది చాకచక్యంగా డెలివరీ చేయించడంతో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. వెంటనే దగ్గర్లో ఉన్న మర్రిపాడు పీహెచ్‌సీలో ఆమెను చేర్పించారు. 108 సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.

రామతీర్థం హుండీల ఆదాయం రూ.26.51 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి వారి ఆలయంలో హుండీల ఆదాయాన్ని దేవస్థానం అధికారులు గురువారం లెక్కించారు. మొత్తం 89 రోజులకు గానూ రూ.26,51,272 ఆదాయం లభించినట్లు ఈఓ ప్రసాదరావు తెలిపారు. దేవస్థాన సహాయ కమిషనర్ కిశోర్ కుమార్ హుండీ లెక్కింపును దగ్గరుండి పర్యవేక్షించారు. సుమారు 180 మంది శ్రీవారి సేవా భక్తులు హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా స్థానిక పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.

గర్జించిన బొబ్బిలి టైగర్స్



నిర్వాహకుల చేతులమీదుగా జ్ఞాపిక అందుకుంటున్న విజేతలు

బొబ్బిలి రూరల్: ఈనెల 2,3తేదీలలో అనంతపురంలో నిర్వహించిన అంధుల క్రికెట్ రాష్ట్రస్థాయి పోటీలలో బొబ్బిలి టైగర్స్ జట్టు విజయం సాధించింది. లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా విజువల్లీ ఛాలెంజ్‌డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఫర్ ద బ్లైండ్, ది బ్లైండ్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో 9జట్లు పాల్గొనగా ఫైనల్స్‌లో నేత్ర టీంపై బొబ్బిలి టీం విజయం సాధించింది. లంక వెంకటేష్ టీమ్‌కు నేతృత్వం వహించారు. వరుసగా ఏడోసారి బొబ్బిలి టీమ్ రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించింది. టీమ్ సభ్యులంతా బొబ్బిలి మండలం మెట్టవలస ఏషియన్ ఎయిడ్ ఫర్ ద బ్లైండ్ అంధుల పాఠశాలలో చదువుకుని పలు ప్రాంతాలలో ఉద్యోగాల్లో స్థిరపడిన వారు. వారికి నిర్వాహకులు జ్ఞాపికతో పాటు రూ.12వేలు అందజేశారు. పలువురు ప్రముఖులు, క్రీడాభిమానులు జట్టు సభ్యులను అభినందించారు.

పేకాట రాయుళ్లపై కేసు నమోదు

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి పంచాయతీలో ముగ్గురు, ఎం.హరిపురంలో ముగ్గురు పేకాట ఆడుతుండగా పట్టుబడడంతో వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కళాధర్ తెలిపారు.వారి నుంచి రూ.7600 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లో కోడి పందాలు ఆడినా, పేకాట ఆడినా సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

22 మందికి కారుణ్య నియామకాలు

- సచివాలయాలలో పోస్టింగ్



నియామక ఉత్తర్వులు అందజేస్తున్న డీఆర్‌ఓ గణపతిరావు

విజయనగరం అర్బన్: ఆర్‌టీసీలో ఉద్యోగం చేస్తూ మరణించిన వారి వారసులు 22 మందికి సచివాలయాల్లో కారుణ్య నియామకాలు కల్పిస్తూ కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఉత్తర్వులు జారీచేశారు. 22 మందిలో 10 మంది వెల్ఫేర్ అసిస్టెంట్లుగా, మిగిలిన వారిని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లుగా నియమించారు. ఈ ఉత్తర్వులను డీఆర్‌ఓ ఎం.గణపతిరావు గురువారం తన చాంబర్‌లో అభ్యర్థులకు అందజేశారు.

అందాల బడి పిలుస్తోంది..రా..!

- ఆకర్షితులవుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు
- జిల్లాలో రూ.144.60 కోట్లతో నాడు–నేడు రెండవ దశ
- ముమ్మరంగా జరుగుతున్న పనులు
- పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు



గుమ్మలక్ష్మీపురంలో మొదటివిడతలో నిర్మించిన పాఠశాల భవనం



ఉల్లిభద్రలో పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈఓ నాగభూషణరావు

పార్వతీపురం/పార్వతీపురం టౌన్: మూడేళ్ల క్రితం ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల భవనాలు దారుణంగా ఉండేవి. ఇక వసతుల సంగతి సరేసరి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అంగన్వాడీ కేంద్రాలు అధ్వానంగా దర్శనమిచ్చేవి. అప్పుడు అధికారంలో ఉన్న టీడీపీ వాటి అభివృద్ధి గురించి పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాడు–నేడు పథకాన్ని ప్రవేశపెట్టారు. దీనివల్ల తొలిదశలో వేలాది పాఠశాలలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం రెండో దశలో మరిన్ని పాఠశాలలు, ఇంకా అంగన్వాడీ కేంద్రాలు, కాలేజీల రూపురేఖలు మార్చేందుకు చర్యలు చేపట్టారు.

మారిన పాఠశాలల రూపురేఖలు

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలంటే చిన్నచూపు ఉండేది. అక్కడ సౌకర్యాలు ఉండవని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లకు పంపేవారు. నేడు పరిస్థితి మారింది. కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడుల్లో మౌలిక వసతులు కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మనబడి నాడు–నేడు పథకాన్ని అమలుచేసి పాఠశాలల రూపురేఖలను సమూలంగా మార్చుచేస్తున్నారు. దీని ద్వారా ఇప్పటికే పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో తొలివిడత 486 పాఠశాలల్లో రూ. 111.44 కోట్లు వెచ్చించి పాఠశాలలకు అదనపు గదులు, మౌలిక వసతులు కల్పించారు. రెండో విడత పనులు శరవేగంగా నాణ్యంగా జరుగుతున్నాయి. ఎంపిక చేసిన పాఠశాలలు, కళాశాలల్లో అభివృద్ధి పనుల కోసం ఇప్పటికే 15శాతం నిధులు విడుదల చేశారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం నాటికి పనులు పూర్తి చేసి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి కార్పొరేట్ లుక్‌లో పాఠశాలలు విద్యార్థులకు స్వాగతం పలకనున్నాయి.

అభివృద్ధి పనులిలా ..

ఎంపికైన పాఠశాలలు, అంగన్వాడీలు, జూనియర్ కళాశాలల్లో మొత్తం పది రకాల అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. ఆర్‌ఓ ప్లాంట్లు, మరుగుదొడ్లు, ప్రహరీలు, కిచెన్ షెడ్ల నిర్మాణాలు చేస్తున్నారు. పెయింట్ వేయిస్తారు. లైట్లు, ఫ్యాన్లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల కోసం కుర్చీలు, బెంచీలు, ఇంగ్లీష్ ల్యాబ్, గ్రీన్ చాకో బోర్డు తదితరాలు ఏర్పాటు చేయనున్నారు. మేజర్, మైనర్ రిపేర్లు చేపడతారు.

నిధుల కేటాయింపు

పార్వతీపురం మన్యం జిల్లాలో రెండో విడత నాడు–నేడులో భాగంగా 545 పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్ వాడీ కేంద్రాలను ఎంపిక చేశారు. రెండో విడత పనుల కోసం ప్రభుత్వం రూ.144.60 కోట్ల నిధులను కేటాయించింది. ఈ మేరకు ఆయాపాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పనులు జరుగుతున్నాయి.

అలాగే పార్వతీపురం మన్యం జిల్లాలోని 14 జూనియర్ కళాశాలలను నాడు–నేడుకు ఎంపిక చేశారు. వాటిలో పలు రకాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించడం, కళాశాల భవనాలకు మరమ్మతులు, పెయింట్ వేయించడం, గ్రీన్ చాకో బోర్డు, కుర్చీలు, బల్లలు ఏర్పాటు చేయనున్నారు. కళాశాలల్లో నాడు–నేడు పనులను కూడా మే నెలాఖరు కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

పర్యవేక్షణ కమిటీల ఏర్పాటు

నాడు–నేడు పనులు త్వరితగతిన పూర్తి చేసేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కమిటీలను ఏర్పాటు చేశారు. పాఠశాల స్థాయిలో హెడ్ మాస్టర్, పేరెంట్స్ కమిటీ సభ్యులు, మండల స్థాయిలో ఎంఈఓ, ఏపీఎం, డివిజన్ స్థాయిలో డిప్యూటీ డీఈఓ, జిల్లా స్థాయిలో పంచాయతీ రాజ్ ఎస్ఈ, సమగ్రశిక్ష ఈఈ కమిటీల్లో ఉన్నారు. సచివాలయంలోని ఇంజినీరింగ్ అసి స్టెంట్ రోజూ బడులకు వెళ్లి పనుల ఫొటో తీసి ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

'త్వరగా పూర్తిచేయాలి



నాడు–నేడు పనుల కోసం ఫర్నిచర్, శానిటరీ, ఫ్యాన్లు, లైట్లు, ఎలక్ట్రికల్స్, సిరామిక్ టైల్స్ పాఠశాలలకు సరఫరా చేశాం. వాటితోపాటు సిమెంట్ కూడా అందించాం. పనులను అత్యంత నాణ్యతతో త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించాం. పనులు జరుగుతున్న పాఠశాలల్లో విద్యార్థులు ప్రమాదాల బారిన పడకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

–ఎస్‌డీవీ.రమణ, డీఈఓ, పార్వతీపురం మన్యం జిల్లా

ఆంధ్రా జట్టు రెండవ ఇన్నింగ్స్ 462

- నేటితో ముగియనున్న ఆంధ్రా–హైదరాబాద్ రంజీ మ్యాచ్





సెంచరీలతో చెలరేగిన ఆంధ్రా బ్యాట్స్‌మెన్ రిక్కీబుయ్, కరణ్ షిండే

విజయనగరం: ఆంధ్రా బ్యాట్స్‌మెన్ కరణ్‌షిండే (180 బంతుల్లో 11ఫోర్లు, 1 సిక్సర్‌తో 105 పరుగులు), రిక్కీ బుయ్ (150 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సర్లతో 116 పరుగులు)ల అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనతో ఆంధ్రా జట్టు రెండవ ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు సాధించింది. నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ వేదికగా జరుగుతున్న ఆంధ్రా– హైదరాబాద్ జట్ల మధ్య రంజీ మ్యాచ్ డెంకాడ మండలం చింతలవలసలో గల పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ (నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ) ఆవరణలో మూడవ రోజు గురువారం మ్యాచ్ కొనసాగింది. మూడవ రోజు ఆంధ్రా బ్యాట్స్‌మెన్ రిక్కీ బుయ్, కరణ్ షిండేలు సెంచరీలతో చెలరేగారు. 48 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 230 పరుగులు ఓవర్ నైట్ స్కోరు వద్ద మూడవ రోజు గురువారం రెండవ ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు మొత్తం 107.3 ఓవర్లలో 462 పరుగులు భారీ స్కోరు చేసి ఆలౌటైంది. అనంతరం రెండవ ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన హైదరాబాద్ జట్టు మూడవ రోజు ఆట ముగిసే సమయానికి 25 ఓవర్లలో 2 వికెట్లు నష్టపయి 75 పరుగులు చేసింది. బ్యాటింగ్‌లో హైదరాబాద్ బ్యాట్స్‌మెన్ కె.రోహిత్ రాయుడు 46 పరుగులతో నాటౌట్‌గా కొనసాగుతుండగా..ఆంధ్రా బౌలర్‌లు కేవీ.శశికాంత్, కె.సుదర్శన్‌లు చెరో వికెట్ దక్కించుకున్నారు. అంతకుముందు హైదరాబాద్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 197పరుగులు చేయగా..ఆంధ్రా జట్టు 135 పరుగులు చేసిన విషయం విదితమే. ఇదిలా ఉండగా టెస్ట్ మ్యాచ్ తరహాలో నాలుగు రోజుల పాటు నిర్వహించే మ్యాచ్‌లో శుక్రవారం మ్యాచ్ ముగియనుంది.

నేడు ఐపీఎల్ ఎంపికైన క్రీడాకారులకు సన్మానం

2023వ సంవత్సరంలో జరగనున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను శుక్రవారం సత్కరించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎస్‌రాజు తెలిపారు. నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీలో సాయంత్రం 4.30 గంటలకు క్రీడాకారులు కేఎస్.భరత్, నితీష్‌కుమార్‌రెడ్డి, రషీద్‌లను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్ రెడ్డి సత్కరించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ కోవిడ్–19 నిబంధనలు పాటించాలి

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ సూర్యకుమారి



ఎ.సూర్యకుమారి, కలెక్టర్

విజయనగరం అర్బన్: ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ కోవిడ్–19 నిబంధనలు కచ్చితంగా పాటించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి హెచ్చరించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో కోవిడ్ నిబంధనలు విధిగా పాటించాలని ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించేలా ఆయా విభాగాధిపతులు చర్యలు తీసుకోవాలని గురువారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నాలుగో వేవ్ పై ప్రజలను అప్రమత్తం చేయడంలో కింది స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని శాఖల అధికారులు భాగస్వామ్యం కావాలని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు, ప్రజాసంఘాల సభ్యులు, స్వచ్ఛందసేవా సంస్థల నిర్వాహకుల నుంచి సహాయం పొందాలని సూచించారు. సఖి గ్రూపుల సభ్యుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ కోవిడ్ నాలుగో దశ ప్రమాదంపై ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఆరు మీటర్ల భౌతిక దూరం పాటించాలని, గుమిగూడరాదని హితవు పలికారు. ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించాలని, శానిటైజర్ వినియోగించాలని సూచించారు. వైద్య సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు భయభ్రాంతులకు గురికాకుండా వారిలో ధైర్యం నింపాలని పేర్కొన్నారు.

బ్రిడ్జిపైకి దూసుకుపోయిన లారీ

- స్తంభించిన ట్రాఫిక్



విశాఖ రోడ్డులో సోంపురం బ్రిడ్జిపై దూసుకుపోయిన లారీ

లక్కవరపుకోట: అరకు–విశాఖపట్నం జాతీయ రహదారిలో సోంపురం జంక్షన్ సమీపంలో గల బ్రిడ్జిపైకి ఓ లారీ అదుపుతప్పి దూసుకుపోయింది. గురువారం తెల్లవారు జామున బొద్దాం సమీపంలో గల క్వారీ నుంచి 20 ఎంఎం నల్ల పిక్క లోడ్ వేసుకుని విశాఖపట్నం సమీపంలో గల మధురవాడ వెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు డ్రైవర్ సత్యనారాయణ తెలిపారు. ఎదురుగా వచ్చిన భారీ వాహనాం లైటింగ్ నేరుగా కళ్లల్లో పడడంతో అదుపు తప్పినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తు ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా తెల్లవారుజామున ఈ ప్రమాదం సంభవించడంతో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ఎస్సై ఎస్.ముకుందరావు సిబ్బందితో వెళ్లి లారీని క్రేన్ సహాయంతో పక్కకు నెట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

స్కూల్ ఆటో బోల్తా: చిన్నారులకు గాయాలు



గాయపడిన చిన్నారులను కారులో ఆస్పత్రికి తీసుకువెళ్తున్న కటుంబసభ్యులు

చీపురుపల్లి రూరల్: పిల్లలను స్కూల్‌కు తీసుకువెళ్తూ ఆటో బోల్తా పడిన సంఘటనలో పలువురు చిన్నారులకు గాయాలయ్యాయి. చీపురుపల్లి మండలం మెట్టపల్లి గ్రామానికి చెందిన పిల్లలు చీపురుపల్లి పట్టణంలో గల ప్రైవేట్ స్కూల్స్‌లో చదువుతున్నారు. గురువారం ఉదయం విద్యార్థులను మెట్టపల్లి గ్రామం నుంచి ఆటోలో స్కూల్‌కు తీసుకువెళ్తుండగా చీపురుపల్లి–మెట్టపల్లి ప్రధాన రహదారిలో ఎలకలపేట కూడలి వద్ద ఆటో బోల్తా పడింది. ఈ సంఘటనలో చిన్నారి సింగారపు లాస్య కాలు విరిగిపోగా, బాలుడు పి.దినేష్ మోకాలికి గాయమైంది. వారిద్దరిని మెరుగైన చికిత్స కోసం విజయనగరం ఆస్పత్రికి తరలించారు. మరో నలుగురు చిన్నారులకు స్వల్ప గాయాలు కావడంతో సమాచారం మేరకు వచ్చిన చిన్నారుల తల్లిదండ్రులు చీపురుపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

ఆటో బైక్ ఢీకొని మరో నలుగురికి..

కొమరాడ: మండలంలోని విక్రంపురం నుంచి రాజ్యలక్ష్మీపురం వెళ్లే రహదారి పై గురువారం రాజ్యలక్ష్మీపురానికి చెందిన టి.వెంకటేశ్వర రావు పార్వతీపురంలో పని పూర్తి చేసుకుని ఇంటికి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా మార్గ మధ్యంలో అదే గ్రామానికి చెందిన కొండగొర్రి చిన్న దంపతులు, వారి కుమారుడికి లిఫ్ట్ ఇచ్చాడు. తర్వాత వారు మోటార్ సైకిల్‌పై ఇంటికి వస్తుండగా విక్రంపురం సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో నలుగురికీ తీవ్రగాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి వారిని తరలించగా చిక్సిత పొందుతున్నారు.

వ్యాన్ ఢీకొని విద్యార్థికి..



గాయపడిన విద్యార్థికి చికిత్స అందిస్తున్న దృశ్యం

వంగర: మండల పరిధి ఎం.సీతారాంపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్న పల్ల మణికంఠను వ్యాన్ ఢీకొనడంతో గాయాలయ్యాయి. విద్యార్థి మణికంఠ బీసీ బాలుర వసతి గృహం నుంచి పాఠశాలకు వెళ్తున్న సమయంలో ధాన్యం లోడుతో వెళ్తున్న వ్యాన్ ఢీకొట్టింది. దీంతో మణికంఠ కాలికి తీవ్రగాయమైంది. స్థానికుల సమాచారం మేరకు 108 వాహన సిబ్బంది గురుగుబెల్లి రాజారావు, ఉత్తరావెల్లి అనీల్‌కుమార్‌లు ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

పరామర్శకు వెళ్తూ మహిళ మృతి

- బైక్‌లో చీర కొంగు చుట్టుకుని ప్రమాదం



ప్రమాదంలో మృతిచెందిన పాలక లలిత

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: ద్విచక్ర వాహనం వెనుక టైరులో చీర కొంగు చుట్టుకుని కింద పడిపోవడంతో గిరిజన మహిళ పాలక లలిత(44) మృతిచెందింది. ఈ సంఘటన కురుపాం మండలంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కొత్తూరులోని ఓ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న తన చెల్లెలు అరుణకుమారి కుమార్తెను పరామర్శించేందుకు కురుపాం మండలం వలసబల్లేరు గ్రామానికి చెందిన లలిత తన మరిదితో కలిసి గురువారం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మార్గమధ్యంలో డంగులగూడ గ్రామ సమీపంలో ఆమె చీర కొంగు గాలి కారణంగా జారి బైక్ వెనుక టైరులోకి చొచ్చుకుపోవడంతో కింద పడిపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను హుటాహుటిన 108లో నీలకంఠాపురం పీహెచ్‌సీకి తీసుకురాగా ప్రాథమిక చికిత్స అనంతరం అక్కడి వైద్య సిబ్బంది మెరుగైన వైద్యం నిమిత్తం గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేశారు. అక్కడి నుంచి భద్రగిరి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. మృతురాలి భర్త కేశవరావు ఏడాది క్రితమే మృతిచెందాడు. ఆమెకు వంశీ, నాని, చందు అనే ముగ్గురు పిల్లలున్నారు. తండ్రితో పాటు తల్లి కూడా మరణించడంతో ముగ్గురు పిల్లలు భోరున విలపిస్తున్నారు. ఈ సంఘంటనపై నీలకంఠాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. శవపంచనామా అనంతరం భద్రగిరి ఆస్పత్రిలో పోస్టు మార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందించారు.

ఉత్సాహంగా పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ మీట్



స్పోర్ట్స్‌మీట్‌ను ప్రారంభిస్తున్న ఏయూ ప్రొఫెసర్ పాల్ తదితరులు

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో గురువారం అంతర్ జిల్లాల రీజనల్ పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ మీట్ ఉత్సాహభరితంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎస్ఏడీ పాల్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తూ స్నేహపూర్వక వాతావరణంలో ఆటలు ఆడాలని విద్యార్థులకు సూచించారు. క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి మెడల్స్ అందుకోవాలని పిలుపునిచ్చారు. క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుందని చెప్పారు. ఉమ్మడి జిల్లాల పరిధిలోని 15 కళాశాలల నుంచి 591 మంది విద్యార్థులు ఈ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్నారని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఆశారాణి తెలిపారు. తొలిరోజు పరుగుపందెం, షాట్‌పుట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చదరంగం, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాంశాలు నిర్వహించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, సెట్విజ్ సీఈవో వీకే.దుర్గాప్రసాద్, జిల్లా యువజన విభాగం అధికారి విక్రమాదిత్య, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ పి.అప్పలనాయుడు, పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్ నాలెడ్జ్ వెహికల్ ప్రారంభం



నాలెడ్జ్ వెహికల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలోని జూనియర్ కళాశాలల విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు సెంచూరియన్ యూనివర్సిటీ రూపొందించిన నాలెడ్జ్ వెహికల్‌ను గురువారం శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలతో కూడిన చదువుతోపాటు ఉపాధి, ఉద్యోగాలకు కల్పనలో సెంచూరియన్ యూనివర్సిటీ తనదైన ముద్ర వేస్తుండటం అభినందనీయమన్నారు. వర్సిటీ అడ్మిషన్స్ మేనేజర్ శాసనం ఫల్గుణరావు మాట్లాడుతూ నాలెడ్జి వెహికల్ ద్వారా వ్యవసాయంలో అధునాతన పరికరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. సాఫ్ట్‌వేర్ కోర్సులకు దీటుగా మెకానికల్ కోర్సులకు సైతం దేశవ్యాప్తంగా డిమాండ్ ఉందన్నారు. సెంచూరియన్ వర్సిటీలో అన్ని కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అనంతరం పలు కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వర్సిటీ మెకానికల్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి అఖిల భరత్య పాల్గొన్నారు.

భార్యను హింసించిన కేసులో భర్తకు జైలుశిక్ష

రాజాం సిటీ: మండల పరిధి బొద్దాం గ్రామానికి పట్నాన అప్పలరాజుకు భార్యను హింసించిన కేసులో ఆరు నెలల జైలు శిక్షను విధించారని సీఐ కె.రవికుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తన భర్త నిత్యం మద్యం తాగి శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని గ్రామానికి చెందిన పట్నాన రామలక్ష్మి 2016లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అప్పటి ఎస్సై డి. అప్పలనాయుడు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఆ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిమిడి సూర్యకుమార్ వాదించి ముద్దాయిపై నేరం రుజువు చేశారు. దీంతో భార్యను హింసకు గురిచేసిన అప్పలరాజుకు ఆరు నెలల జైలుశిక్షతోపాటు రూ.1000 జరిమానా, అలాగే కొట్టినందుకు మూడు నెలల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఎస్‌పీబీ కృష్ణసాయితేజ గురువారం తీర్పు విధించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన వెంకట సూర్యారావు

సింహాచలం: విజయనగరం జిల్లా ఎల్.కోట సమీపంలోని గొల్జాం గ్రామానికి చెందిన కోట్ని వెంకట సూర్యారావు (36), పెందుర్తి మండలం రాతిచెరువు వద్ద పెందుర్తి నుంచి ఆనందపురం వెళ్లే రోడ్డులో జరిగిన ప్రమాదంలో మృతిచెందాడు. వెంకట సూర్యారావుకు ఏడాదిన్నర క్రితం వివాహం కాగా చిన్నపాప ఉంది. ప్రస్తుతం భార్య, పాప ఆనందపురం మండలం మామిడిలోవలో అత్తవారింట్లో ఉన్నారు. భార్య, కూతుర్ని చూసేందుకు బుధవారం రాత్రి మామిడిలోవ ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరిగి గురువారం తెల్లవారుజామున బయల్దేరి గొల్జాం వస్తుండగా రాతిచెరువు వద్ద గతుకుల రోడ్డుపై ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో కిందపడిపోయాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ వెంకట సూర్యారావు పైనుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210